
కులకచర్లలోని పెద్ద గేటు చౌరస్తాలో..


తాండూరు: మేడే కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు, కార్మికులు


యాలాల మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

# మేడే స్ఫూర్తితో పోరాడుదాం

- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- రెపరెపలాడిన ఎర్రజెండా..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై నేతల ఆగ్రహం
- పోరుబాటనే మార్గమని పిలుపు

పరిగి, మే 1: మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడుదామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మేడే సందర్భంగా పరిగి పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో లేబర్ అడ్డా, తుంకులగడ్డలో సీపీఎం జెండాలు ఆవిష్కరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర, మున్సిపల్, ట్రాన్స్‌కో కార్యాలయాల వద్ద జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేసి మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌కు కుదించి అమలు చేయడం వల్ల కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చేశారన్నారు. అసంఘటిత కార్మిక వర్గానికి ఏ విధమైన సామాజిక భద్రత లేదన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు నిలుపుదల కోసం, వేతనాలు, పెన్షన్ పెంపు కోసం మేడే స్ఫూర్తితో పోరాడాలన్నారు. మే 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంగమ్మ, నాయకులు హబీబ్, సత్యయ్య, సీఐటీయూ నాయకులు పద్మమ్మ, స్వరూప, సుజాత, అంగన్‌వాడీ నాయకురాళ్లు స్వరూప, మణిమాల పాల్గొన్నారు.

**తాండూరు:** ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని తాండూరు నియోజకవర్గంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, హమాలీ, దడువాయి, గుమాస్తా, బండి, చాట కార్మిక, ఆర్టీసీ సంఘాల నేతలు ఎర్రజెండాలను ఎగరవేసి స్వీట్లు పంచిపెట్టారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన మేడే సంబురాల్లో కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పనికి తగిన వేతనంతో పాటు ఆరోగ్యం, భీమాతో పాటు పలు సౌకర్యాలను కల్పించాలన్నారు. వేలాది మంది కార్మికులు ఉన్న తాండూరులో ఈఎస్ఐ ఆసుపత్రి లేదన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో పెట్టుబడి దారులు కేవలం తమ ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తూ కార్మికుల శ్రేయస్సును పట్టించుకోకుండా విస్మరిస్తున్నారని విమర్శించారు. కార్మికుల శ్రేయస్సు కోసం చట్ట సభల్లో పోరాడే నాయకులు ఉన్నప్పుడే కార్మిక వర్గ సంక్షేమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, పలు పార్టీల నేతలు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు. యాలాల మండల కేంద్రంలో జరిగిన మేడే వేడుకలలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పలి మల్కయ్య పాల్గొన్నారు.

**వికారాబాద్:** పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవడం కోసం, కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధం కావాలని బీఆర్‌టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు భూమొళ్ల కృష్ణయ్య పిలుపునిచ్చారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఏరియా హాస్పిటల్ ముందు మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కుల్ని కాలరాస్తుందన్నారు. యాజమాన్యాలకు అనుగుణంగా కార్మిక చట్టా లల్లో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు చేసిందని విమర్శించారు. కార్మికులకు అండగా ఉన్న 44 చట్టాలను నాలుగు చట్టాలుగా మార్చిందని విమర్శించారు. కొన్ని రంగాల్లో సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్, అమలు చేయడం లేదని విమర్శించారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభు త్వం కార్మికులకు ఎన్నికల ముందు కనీస వేతనాలు రూ. 21వేలు అమలు చేస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచి పోయిందన్నారు. నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కచ్చితంగా జిల్లాలోని కార్మికులకు ఈఎస్ఐ , పీఎఫ్, అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో లేబర్ కోర్టులలో కేసులు వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేశ్, ప్రశాంత్, గౌస్, పద్మమ్మ, స్వ రూప, యాదమ్మ , కుమార్, ముసలయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్:** బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో సీఐటీయూ నాయకుడు బుస్స చంద్రయ్య ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలోని చికాగో వీరుల త్యాగఫలితమే ప్రస్తుతం 8 గంటల పని విధానమన్నారు. కానీ కేంద్రప్రభుత్వం 12 గంటలు పెంచేందుకు ప్రయత్నిస్తుంద న్నారు. కార్యక్రమంలో రాజు, కిష్టప్ప, హన్మ్యనాయక్, విట్టల్‌నాయక్, రామకృష్ణ,అనురాధ తదితరులు పాల్గొన్నారు.


పరిగి పట్టణంలో..

**కులకచర్ల :** కులకచర్ల మేస్త్రీల సంఘం, కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. కార్మికులకు ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహకాలను అందించి ఆదుకోవాలని పలువురు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్మికుల అభివృద్ధి కోసం వివిద సంక్షేమ పథకాలను తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు అయ్యలగారి కృష్ణయ్య పాల్గొన్నారు.

**కొడంగల్:** కొడంగల్ పట్టణంలో మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు బుస్సచంద్రయ్య మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉండాలని, అప్పుడే హక్కులను సాధించుకునే ఆస్కారం ఉంటుం దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అధ్యక్షులు పకీరప్ప, ఉపాధ్యక్షుడు మెగులప్ప, కార్యదర్శి వెంకట లక్ష్మితో పాటు సుగుణమ్మ, మాఫి వెంకటయ్య, విజయ్ కుమార్, రెహెనా, నవనీత, యాదమ్మ వెంకటమ్మ, రాజు రాములు తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్‌లో..


బొంరాస్‌పేటలో..


కొడంగల్ పట్టణంలో..

## గ్రామ నాయకుడి శ్రమదానం


ధారూరు, మే 1: పల్లె పరిశుభ్రంగా ఉండాలని మురుగు కాలువలను శుభ్రం చేసినట్లు గ్రామ నాయకుడు ఆగమయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో కొన్ని రోజులుగా పారిశుధ్య కార్మికులు పనిచేయకపోవడంతో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో మురుగు నీరు నిలిచిపోయి కంపుకొడుతుంది. అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. మురుగు కాలువలను శుభ్రం చేసి చెత్తను తొలగించేశారు. ఇప్పటి అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు.

## కోనేరులో పూడికతీత పనులు


కులకచర్ల, మే 1: మండల పరిధిలోని బండవెల్కిచర్ల శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఉన్న సిద్ధి రామప్ప సమాధి ముందు ఉన్న కోనేరు పనులను గురువారం దేవాలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. సిద్దిరామప్ప సమాధివద్ద చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కోనేరులో పూడిక తీత పనులు నిర్వహించారు. కోనేరులో గతంలో నీరు ఉండేదని నేడు కూడా పూడిక తీత వలన నీళ్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ గోడపత్రిక విడుదల


బొంరాస్‌పేట్, మే 1 : ఈ నెల 4న మండల పరిధిలోని ఏర్పుమళ్ల గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రజాసంఘాల అధ్వర్యంలో ఛలో ఏర్పుమళ్ల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేశ్‌బాబు, చంద్రయ్య, సాయిలు, లక్ష్మయ్య, వెంకటయ్య, సూర్యనాయక్, కరీం, సికందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలి


ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం నాయకులు

కులకచర్ల, మే 1: ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జంబు వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం కులకచర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణకు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి ఉపాధిహామీ పథకంలో కీలకంగా పనులు నిర్వహిస్తూ జీతాలు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముఖ్యంగా తమ సంస్థలో పనిచేస్తున్న కొంత మందికి ఎఫ్‌టీఈగా ప్రభుత్వం గుర్తించిందని తమకు కూడా ఎఫ్‌టీఈగా గుర్తించాలని, సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని దీనిని నెరవేర్చాలన్నారు. జీతాలు కూడా ప్రతి నెల సకాలంలో రాక కుటుంబాలను పోషించుకునే స్థోమత కూడా పోయిందన్నారు. నెలకు కనీసం రూ. 25వేల వేతనం అందించాలని, హెల్త్‌కార్డులను ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు రూ.15లక్షల పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. ఫిబ్రవరి నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల మండల ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షులు రఘు రాములు, మహిళా అధ్యక్షురాలు అనితారెడ్డి, వివిధ గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.


కులకచర్ల, మే 1: కులకచర్ల మండల కేంద్రంలో అంతారం గ్రామానికి చెందిన రాంచంద్రయ్యకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ 60వేల చెక్కును డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్య గౌడ్, అంతారం మాజీ ఉపసర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.


పెద్దేముల్, మే 1 : అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దేముల్ మండలం మదనంతాపూర్ గ్రామానికి చెందిన తారీ బాయి తండ్రి రవికి రూ. 75వేల ఎల్వోసీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో నాయకుడు నారాయణరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎండి. మైపూస్, రాజూ నాయక్, రాందాస్ పాల్గొన్నారు.

## శ్రీతేజ్ కోలుకుంటున్నాడు..

సిటీబ్యూరో, మే 1(నమస్తే తెలంగాణ): పుష్ప–2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్ కోలుకుంటున్నట్లు తండ్రి భాస్కర్ తెలిపారు. వైద్యుల సూచనలతో ప్రస్తుతం రీహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకొచ్చినట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. గతంతో పోలిస్తే ఆరోగ్యం 10–15శాతం మెరుగైందని, ఫిజియోథెరపీ చేస్తే నరాలు రిలీఫ్ అయ్యి స్పందించే అవకాశాలు ఉన్నట్లు వైద్యులు సూచించినట్లు ఆయన తెలిపారు. అల్లు అర్జున్ ఇచ్చిన హామీ మేరకు పిల్లల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు.

## మిషన్ భగీరథ మరమ్మతు పనుల పరిశీలన


బొంరాస్‌పేట, మే 1: దుద్యాల మండల ఈర్లపల్లి గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉన్న నాన్యనాయక్‌తండాలో మిషన్ భగీరథ మరమ్మతు పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయలక్ష్మి గురువారం పరిశీలించారు.మిషన్ భగీరథ ద్వారా తండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు అందించేందుకు మరమ్మతు పనులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌చారి,ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్ పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపు తరగతులు ప్రారంభం



దోమ, మే 1: సమ్మర్ క్యాంపు విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్ మోరల్ వ్యాల్యూస్‌ను పెంపొందిస్తాయని ఎంఈవో వెంకట్ అన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని బొంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంపు తరగతులను ప్రధానోపాధ్యాయుడు షఫీ అధ్యక్షతన ఎంఈవో వెంకట్ ప్రారంభించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫీ ఇండో గ్లోబల్ అవార్డు పొందిన సందర్భంగా ఆయనను గ్రామస్తులు సన్మా నించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొళ్ల సురేశ్, ఎంపీటీసీ రాములు, స్కూల్ చైర్మన్ నసీమా బేగం, మాజీ వార్డు సభ్యుడు చంద్రశేఖర్ గ్రామస్తులు బషీర్, భీమయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కులగణన వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కీలకం

వికారాబాద్, మే 1: కులగణన సామాజిక న్యాయం, రిజర్వేషన్ విధానాల సమర్థత, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కీలకమైనదని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులగణన నిర్వహణకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంతోషం వ్యక్తం చేశామన్నారు. రాబోయే జనాభా గణనలో చేర్చాలని నిర్ణయించడం ఒక చారిత్రక నిర్ణయం అన్నారు. ఈ చర్య ద్వారా వెనుకబడిన కులాలు , షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఖచ్చితమైన జనాభా డేటా సేకరించబడుతుందని తెలిపారు. ఇది విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యంలో న్యాయమైన వాటాను నిర్ధారించడానికి ఉపయోగపడుతుందన్నారు.



వికారాబాద్ డీటీసీ డీఎస్పీగా ఎస్. శ్రీనివాసులు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మొక్కను అందజేశారు. – వికారాబాద్


దోమ, మే 1: మండల పరధిలోని పాలేపల్లి గ్రామంలో శ్రీరామ పట్టాభిషేకం వీధి నాటకాన్ని ప్రదర్శించగా గ్రామానికి చెందిన జోగు దస్తయ్య దంపతులు రూ.పది వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి భక్తి కార్యక్రమాలు చేపట్టినా తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తామన్నారు.కార్యక్రమంలో నాటక గురువు నర్సింహులు, సభ్యులు ఆత్మలింగం, కిష్టయ్య, టీచర్ వెంకటయ్య, బసప్ప పాల్గొన్నారు.

## 63 అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

ఆదిబట్ల, మే 1:మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో 63 అవుట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం గురువారం నోటీఫికేషన్ జారీ చేసింది.ల్యాబ్ అటెండెట్లు 13, వక్రీభవన నిపుణుడు, ఆప్టీషియన్ 1, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ 4, ఓటీ టెక్నీషియన్ 4, అన స్థీషియా టెక్నీషియన్ 4, దంత సాంకేతిక నిపుణుడు1, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ 1, రికార్డ్ క్లర్క్, రికార్డ్ అసి స్టెంట్ 1, కేటలాగూర్ 1, మ్యూజియం అసిస్టెంట్ కమ్ ఆర్టిస్ట్ 1, ఆడియో విజువల్ టెక్నీషియన్ 1,వార్డుబాయ్ 4, ధోబీ ప్యాకర్ 3, వడ్రంగి 1, మంగలి 3, దర్జీ 1, ఎల క్ట్రీషియన్ 3, ప్లంబర్ 2, థియేటర్ అసిస్టెంట్ 6, గ్యాస్ ఆపరేటర్ 2, ఇసీజీ టెక్నీషియన్ 3 మొత్తం కలిపి 63 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటీఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుల స్వీరణకు చివరి తేదీ మే 10. అందిన దర ఖాస్తులను రిశీలించిన తరువాత, పైన పేర్కొన్న జిల్లా మరియు కళాశాల వెబ్‌సైట్‌లో తాత్కాలిక మెరిట్ జాబి తాను ప్రచురిస్తామని, అభ్యంతరాలను ఆహ్వానిస్తామని అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం అన్ని అభ్యంతరాలను పాటించిన తర్వాతనే ఎంపిక జాబితా ప్రచురిస్తామని అధికారులు తెలిపారు.

## నకిలీ సిమ్‌కార్డుల మోసగాడి అరెస్ట్

బంజారాహిల్స్/సిటీబ్యూరో, మే 1(నమస్తే తెలంగాణ): ఏపీలోని తాడేపల్లిగూడేనికి చెందిన మున్వర్ భాషా సిమ్‌కార్డు ప్రమోటర్, ఫీల్డ్‌సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. తనకిచ్చిన సిమ్‌లను తప్పుడు చిరునామాలతో దుర్వినియోగం చేస్తూ మ్యూల్ సిమ్‌కార్డులుగా మారుస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలోనే ఓఎల్ఎక్స్ వినియోగదారులను టార్గెట్ చేసుకుని యాపిల్ వంటి కంపెనీల ప్రకటనల కంటెంట్‌ను కాపీ చేసి తన సొంత ప్రకటనలుగా మారుస్తున్నాడు. దీంతో వినియోగదారులు వాటిని నమ్మి పెద్దమెత్తంలో డబ్బు పోగొట్టుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు వేర్వేరు ఫోన్ నంబర్‌లను ఉపయోగించి మున్వర్ 14 కేసుల్లో అక్రమాలకు పాల్పడ్డాడు. బంజారాహిల్స్ పోలీసులు అతడిని గురువారం అరెస్ట్ చేశారు.

## బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

సిటీబ్యూరో, మే 1(నమస్తే తెలంగాణ): దోమలగూడ పీఎస్ పరిధిలోని హిమాయత్‌నగర్ స్ట్రీట్ నంబర్–8లోని పవాని లింగయ్య అపార్ట్‌మెంట్‌లో బుకీ శ్రీరాజ్‌బూబ్, సబ్ బుకీ సాయినాథ్, పంటర్ రేగళ్ల గోపీనాథ్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. సాయినాథ్, గోపినాథ్‌కు రాజ్ బూబ్ 20శాతం కమీషన్ ఇచ్చి ఏజెంట్లుగా నియమించుకున్నాడు. విదేశాల ఏజెంట్ల ద్వారా బెట్టింగ్ యాప్, దాని పాస్‌వర్డ్ కొనుగోలు చేశాడు. దీని ద్వారా మ్యాచ్, ఓవర్, బంతికి ఒక్కో రేట్‌ను ఫిక్స్ చేసి బెట్టింగ్‌కు పాల్పడుతున్నాడు. ఈ తతంగమంతా నడిపించడానికి వారుండే అపార్ట్‌మెంట్‌లో ఓ డెన్ ఏర్పాటు చేసుకున్నారు. గురవారం వారుంటున్న అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

